సాక్షి
వరంగల్
శనివారం | 12 | అక్టోబర్ | 2024





## సమస్యల పరిష్కారానికి కృషి

విద్యారంగంలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. - 6లో



## 16 నుంచి మణుగూరు-బెల్గావి రైలు ప్రారంభం

ఈనెల 16 నుంచి మణుగూరు-బెల్గావి రైలు పునఃప్రారంభం కానుంది. - 6లో




## వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తాయి. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నాం..



వరంగల్: వరంగల్ దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో రా వాటర్‌ను నిబంధనల మేరకు శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు వరంగల్ మున్సిపల్ వాటర్ సప్లై ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. శుక్రవారం పలు డివిజన్లలో సరఫరా అవుతున్న నీరు వాసన వస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వరంగల్ 13, 14వ డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యటించి సరఫరా అవుతున్న నీటిని పరీక్షించారు. ఈసందర్భంగా రా వాటర్, శుద్ధిచేసి సరఫరా చేస్తున్న నీటిని పరీక్షలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. రా వాటర్ నీటిని క్లోరినేషన్, ఆలం సాంకేతిక నిపుణులు నిర్దేశించిన మేరకు చేస్తున్నామన్నారు. వాటర్ ప్లాంట్లలో లభిస్తున్న ప్యూరిఫయర్ వాటర్‌లో ఎలాంటి మినరల్స్ ఉండవని, కార్పొరేషన్ సరఫరా చేస్తున్న నీటిలో అన్ని మినరల్స్ ఉంటాయన్నారు. అందువల్ల కార్పొరేషన్ సరఫరా చేస్తున్న నీటిలో కొద్దిగా క్లోరిన్ వాసన వస్తుందన్నారు. అంతేకానీ కలుషిత నీటిని సరఫరా చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రతీ రెండు, మూడ్రోజులకోసారి శుద్ధి చేసిన నీటిని పరీక్షల నిమిత్తం ప్రాంతీయ నీటి పరీక్ష కేంద్రాలకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. వారు పూర్తి స్థాయిలో రక్షిత తాగునీరు పంపిణీ చేస్తున్నట్లు ధ్రువీకరిస్తున్నారని ఆయన తెలిపారు. వరంగల్ మున్సిపల్ ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, ఏఈలు కృష్ణమూర్తి, హబీబ్, కార్పొరేటర్ సురేశ్‌జోషి పాల్గొన్నారు.

### యాగ పూర్ణాహుతి

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు గురువారం ఉత్సవాల యాగ పూర్ణాహుతి నిర్వహించారు. శుక్రవారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారి మూలమూర్తికి ఉదయం పూర్ణాభిషేకం, చతుస్థానార్చలు నిర్వహించి గజపూలమాలలతో అమ్మవారిని మహిషాసురమర్దినిగా శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి సిద్ధి ధాత్రి క్రమంలో పూజలు నిర్వహించారు. చతురస్సేవ నిర్వహించారు. సాయంత్రం శుంభహ క్రమంలో అర్చన నిర్వహించి సర్వభూపాలసేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈఓ శేషుభారతి, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### వైద్యాధికారులు నిబద్ధతతో పని చేయాలి

ఎంజీఎం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ బి.రవీందర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం నగరంలోని పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన ప్రజలకు అందుతున్న సేవలు, వివిధ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ సంవత్సరం నమోదైన డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల వివరాలు, జ్వర సర్వే, వైద్య శిబిరాల వివరాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. ఈసందర్భంగా రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫ్యామిలీ విజిట్ సమయంలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మాతా శిశు సంరక్షణ, ఎన్‌సీడీ, టీబీ తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ప్రోగ్రాం అధికారులు జిల్లాలో ఈ ఏడాది లక్ష్యాలను, సాధించిన ప్రగతిని వివరించారు. డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్‌రావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్, పీఓఎంహెచ్‌ఎన్ డాక్టర్ నాగరాజు, వైద్యాధికారి పి.హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

### 14న ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 14న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-19 బాలుర రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ జనన ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 15వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పీఈటీ శ్యాంప్రసాద్‌ను 9849210746 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

- 70 అడుగుల ప్రతిమ సిద్ధం
- ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు అధికారులు
- ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో రావణ వధ

# విజయ వీచిక.. దసరా వేడుక



నేడు విజయ దశమి



సాక్షి వరంగల్/ఖిలా వరంగల్/కాశిబుగ్గ: చెడుపై మంచి సాధించిన రోజు. దుష్టశక్తులపై దైవ శక్తి.. పైచేయి సాధించిన రోజు. పురాణాల, సంస్కృతి పరంగా ప్రీతికరమని భావించే రోజు. విజయాల కలబోతే విజయదశమి. ఈ వేడుకల్ని ఘనంగా జరుపుకునేందుకు గ్రేటర్ వరంగల్ నగరం సిద్ధమైంది. వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో శనివారం నిర్వహించనున్న రావణ వధకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతీ ఏటా దసరా పర్వదినాన జరిపే ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉత్సవ కమిటీ ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. రావణ వధను వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**భారీ ఏర్పాట్లు..**

విజయ దశమి వేడుకల్లో భాగంగా.. ఉర్సు రంగలీల మైదానంలో శనివారం జరగనున్న రావణ వధ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీతోపాటు కార్పొరేషన్ అధికారులు, పోలీసు అధికారులు దసరా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని తోపులాట జరగకుండా బారికేడ్లను సిద్ధం చేశారు. ఎల్‌ఈడీ లైట్లు, లేజర్ షో ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఉత్సవాలను వీడియో తీయనున్నారు.

**ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా..**

సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆదేశాల ప్రకారం.. రంగలీల మైదానంలో జరిగే రావణ వధ కార్యక్రమంలో ట్రాఫిక్, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వేడుకల ప్రదేశాన్ని ఏసీపీ నందిరాంనాయక్‌తో కలిసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు, సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసులకు సూచించారు. వీఐపీల వాహనాల రాకపోకలపై ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ నేతృత్వంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. నలుగురు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, 16 మంది ఎస్సైలతో పాటు 150 మంది పోలీసులు బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా బందోబస్తులో పాల్గొంటారు. మహిళలకు సమస్యలు తలెత్తకుండా, చోరీలు, ఈవ్‌టీజింగ్ జరగకుండా ప్రత్యేకంగా షీ టీంలను రంగంలోకి దింపనున్నారు.

**70 అడుగుల ప్రతిమ..**

వరంగల్ మహా నగరంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు 60 నుంచి 70 అడుగుల రావణుడి ప్రతిమను సిద్ధం చేశారు. వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో, చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణంలో శనివారం జరిగే వేడుకలకు మంత్రి కొండా సురేఖ, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కడియం కావ్య తదితరులు హాజరుకానున్నారు.

**నగరంలో పలుచోట్ల..**

- రావణాసుర వధ, దసరా ఉత్సవాలకు వరంగల్ కాశిబుగ్గలోని చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణం సిద్ధమైంది. కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం ఉత్సవాలు ప్రతిమను కాల్చనున్నట్లు కాశిబుగ్గ ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్లపల్లి రాజ్‌కుమార్ తెలిపారు.
- ఖిలా వరంగల్‌లో తూర్పుకోట, శంభునిపేట విశ్వనాథ కాలనీలో, రంగశాయిపేట మహంకాళి దేవాలయ ప్రాంగణంలో, శివనగర్, తూర్పు కోట ప్రాంతాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. కాశిబుగ్గ ఓసిటీ ప్రాంగణంలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈసారి రంగశాయిపేట, ఓసిటీలో 50 అడుగుల రావణుడి ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారు. రావణ వధ జరిగే ప్రదేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి.



ఉర్సు రంగలీల మైదానంలో దసరాకు అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లు



హనుమకొండ పద్మాక్షి గుండం సమీపంలోని మైదానంలో రావణవధకు చేసిన ఏర్పాట్లు

# బతుకమ్మ విగ్రహంపై దాడి హేయం

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి: మహిళల ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ విగ్రహాలపై దాడి చేయడం హేయమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మైసంపల్లి గ్రామంలో గురువారం రాత్రి దుండగులు బతుకమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం బతుకమ్మ విగ్రహాన్ని పరిశీలించి మహిళలతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులతో మాట్లాడి బతుకమ్మ విగ్రహాలను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా గిట్టని కొంతమంది వ్యక్తులు ధ్వంసం చేశారని తెలిపారు. కాంగ్రెస్‌లోని గ్రూపు రాజకీయాలతోనే బతుకమ్మ విగ్రహం ధ్వంసమైందని ఆరోపించారు. కలిసి మెలిసి ఉండే పల్లెల్లో రాజకీయాలతో దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. వందలాది మంది పోలీసులు, డీసీపీ, ఎస్సై వచ్చి నల్లబెల్లి సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళల స్వేచ్ఛకు భంగం కలిగించారన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే.. దాడులు చేసిన వారికి అండగా నిలుస్తున్నారని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులు అవలంబిస్తున్న విధానాలపై సాక్ష్యాలు, ఆధారాలను త్వరలోనే ఉన్నతాధికారులకు అందించి చర్యల కోసం పోరాటం చేస్తామన్నారు. బతుకమ్మ విగ్రహం ధ్వంసానికి కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పెద్ది డిమాండ్ చేశారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, శంకేషి కమలాకర్, రేవూరి సురేందర్‌రెడ్డి, నగేశ్, చెన్నబస్వరావు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

**నిందితులను కఠినంగా శిక్షించాలి**

మైసంపల్లిలో బతుకమ్మ విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్ డిమాండ్ చేశారు. మైసంపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మపై దాడిని కాంగ్రెస్ పార్టీకి ఆపాదించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే పెద్ది రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నాడని మండిపడ్డారు. నిందితులు ఎవరైనా, ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని ఆయన పోలీసులను కోరారు. సమావేశంలో నాయకులు జేరిపోతుల శేఖర్, కొంకటి అజిత్, ఈద సురేందర్, గంగారపు రవి, సారయ్య, ఇటికాల వేణు, మోకిడె లింగారావు, సుదర్శన్, సంపత్, రమేశ్ పాల్గొన్నారు.



మైసంపల్లిలో బతుకమ్మ విగ్రహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

# రిపోర్ట్ చేసిన కొత్త టీచర్లు

కాళోజీ సెంటర్: డీఎస్సీ-2024లో ఎంపికైన 263 మంది అభ్యర్థుల్లో శుక్రవారం వరకు 248 మంది డీఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు డీఈఓ జ్ఞానేశ్వర్ తెలిపారు. 14 మంది అభ్యర్థుల ఈబీసీ సర్టిఫికెట్ల పరిశీలన ఇంకా పూర్తి కాలేదని, ఇందుకు సంబంధించిన నివేదిక ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు. మరొకరు రిపోర్ట్ చేయలేదని, రిపోర్ట్ చేసిన వారికి సోమవారం పాఠశాలలను కేటాయిస్తామని చెప్పారు. తెలుగు మీడియం బయాలజీ స్కూల్ అసిస్టెంట్స్ 10 మందికి 9 మంది, ఉర్దూ మీడియం బయాలజీ స్కూల్ అసిస్టెంట్ ఒక పోస్టుకు ఒకరు, గణితం ఎస్‌ఏ 13 పోస్టులకు 13 మంది, ఫిజికల్ సైన్స్ ఎస్‌ఏ ఒక పోస్టుకు ఒకరు, తెలుగు ఎస్‌ఏ ఆరు పోస్టులకు ఆరుగురు, హిందీ ఎస్‌ఏ ఐదు పోస్టులకు నలుగురు, ఇంగ్లిష్ ఎస్‌ఏ ఆరు పోస్టులకు ఐదుగురు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్‌ఏ రెండు పోస్టులకు ఇద్దరు, సోషల్ ఎస్‌ఏ 18 పోస్టులకు 16 మంది రిపోర్ట్ చేసినట్లు డీఈఓ వివరించారు. సోషల్ ఉర్దూ మీడియం ఎస్‌ఏ ఒక పోస్టుకు ఒకరు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌ఏ ఐదు పోస్టులకు ఐదుగురు, ఎస్‌ఏ ఉర్దూ ఒకపోస్టుకు ఒకరు, పీఈటీ ఆరు పోస్టులకు ముగ్గురు, ఎల్పీ హిందీ 9 పోస్టులకు 9 మంది, ఎల్పీ తెలుగు 9 పోస్టులకు 9 మంది, ఎస్‌జీటీ తెలుగు మీడియం 163 పోస్టులకుకు 156 మంది, ఎస్‌జీటీ ఉర్దూ మీడియం ఏడు పోస్టులకు ఏడుగురు రిపోర్ట్ చేసినట్లు వివరించారు. మిగత 14 మంది ఈబీసీ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాలేదని, అధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



డీఈఓ జ్ఞానేశ్వర్‌కు రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయురాలు

# గీత కార్మికుల సంక్షేమానికి కృషి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ

నర్సంపేట: గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల గీత కార్మికులకు 199 కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ కాటమయ్య కవచం కిట్లను గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాణ్యమైన కల్లు అందించి ఎంతోమందికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నారని తెలిపారు. కుల వృత్తులతో గ్రామాల అభివృద్ధి చెందుతాయని అన్నారు. గీత కార్మికులకు మేనిఫెస్టోలో ఉన్న విధంగా అన్ని పథకాలను పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని స్పష్టం చేశారు. కంఠమహేశ్వరస్వామి దేవాలయాలకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తాత్కాలికంగా దెబ్బలు తగిలిన వారికి గతంలో రూ.15వేలు ఇచ్చే వారని, రాబోయే రోజుల్లో రూ.25 వేలు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మురళీధర్, సీఐ నరేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్లు బత్తిని రాజేందర్, ఎలకంటి విజయ్‌కుమార్, మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు అనంతుల రమేశ్, గోపా డివిజన్ అధ్యక్షుడు రామగోని సుధాకర్, కాంగ్రెస్ నాయకులు, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గీత కార్మికుడికి కాటమయ్య కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, అధికారులు

# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- రంగలీల మైదానంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- హాజరైన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ సత్య శారద

ఖిలా వరంగల్: పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, కలెక్టర్ సత్య శారదతో కలిసి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.ఐదువేల కోట్ల వ్యయంతో 28 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో నిర్మించే స్కూల్‌కు శంకుస్థాపన చేశామని ఆమె తెలిపారు. మిగిలిన నియోజకవర్గాల్లో విడతల వారీగా స్కూళ్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఒక్కో స్కూల్‌ను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తామని, నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా ఆంగ్ల మధ్యమంలో విద్యాబోధనతోపాటు వసతి కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తామని, విద్యార్థులకే కాకుండా బోధన, బోధనేతర సిబ్బందికి అక్కడే క్వార్టర్లు నిర్మిస్తామని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు విప్లవాత్మక నిర్ణయం అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్లు మరుపల్లి రవి, గుండు చందన, సోమిశెట్టి ప్రవీణ్, సురేశ్‌జోషి, బస్వరాజు కుమారస్వామి, సువర్ణ, ఎన్పీడీసీఎల్, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

# పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి

రైతులకు వరంగల్ వ్యవసాయ కళాశాల అధ్యాపకుల సూచన

వరంగల్: పత్తి, కూరగాయల పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని వరంగల్ వ్యవసాయ కళాశాల అధ్యాపకులు సూచించారు. దత్తత గ్రామం కొత్తపేటలో శుక్రవారం వారు పర్యటించారు. పత్తి, కూరగాయల పంటలను సందర్శించారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగులు, గులాబీ రంగు పురుగులను గుర్తించారు. రైతు తిరుపతిరెడ్డి తను సాగు చేస్తున్న ఎకరం పత్తిపంటలో గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించడానికి నాలుగు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేశారు. అనంతరం అధ్యాపకులు రైతులతో మాట్లాడారు. పత్తిలో గులాబీ రంగు పురుగులు, రసం పీల్చే పురుగులు, గడ్డిపూల నివారణకు వేప గింజల కషాయం (1500 పీపీఎం) 5 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. టమాట, పత్తిలో తెల్లదోమ నివారణకు పసుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో దత్తత గ్రామ కమిటీ సభ్యులు, వ్యవసాయ కళాశాల సిబ్బంది అసిస్టెంట్ ప్రొఫెసర్ (కీటక శాస్త్రం) డాక్టర్ సీహెచ్.అనూష, టీచింగ్ అసోసియేట్ (హార్టికల్చర్) డాక్టర్ ఎస్.వంశీకృష్ణ, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటలో సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న వ్యవసాయ కళాశాల అధ్యాపకులు

# అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల వేతనాలు పెంపు

హన్మకొండ: విద్యుత్ అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల వేతనాల పెంపునకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అంగీకరించినట్లు ఐఎన్‌టీయూసీ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ)-327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తమ యూనియన్ వినతిపత్రానికి స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం స్కిల్డ్ వేతనం రూ.17,598 ఇచ్చేందుకు అంగీకరించిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

రాయపర్తి: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పన్యానాయక్‌తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. పన్యానాయక్‌తండాకు చెందిన భూక్యా మధు (32)హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. దసరా పండుగ కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో భార్యతో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా క్షణికావేశానికి లోనైన మధు తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఓ పాప, బాబు ఉన్నారు. మృతుడి తండ్రి దేవ్లా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# విజయదశమి శుభాకాంక్షలు




# అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**విద్యారణ్యపురి:** విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తాను లేవనెత్తానని, మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికల బరిలో ఉండబోతున్నానని ఇప్పటివరకు పరిష్కారం కాని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతల కల్పనకు కృషిచేసినట్లు చెప్పారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో టైంటేబుల్ మార్పు, కేర్‌టేకర్ల నియామకం, కేజీబీవీ సిబ్బంది రెగ్యులరైజేషన్, కనీస వేతనాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల పదోన్నతులు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టుల మంజూరి కోసం కృషి చేస్తానన్నారు. తాను ఏపార్టీకి కూడా తొత్తుగా వ్యవహరించబోనని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించబోయే వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా పోటీచేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి సో మశేఖర్, రంజిత్‌కుమార్, మల్లారెడ్డి, పెండెం రాజు, కుమార్, కిరణ్‌కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, మురళీకృష్ణ, చంద్రశేఖర్‌రావు, వాసుదేవరెడ్డి, దామోదర్, మల్లిక్ పాల్గొన్నారు.

## నర్సిరెడ్డికి వివిధసంఘాల మద్దతు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలికి ఉపాధ్యాయ, అధ్యాపకసంఘాల మద్దతుతో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి తిరిగి పోటీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి వెల్లడించారు. శుక్రవారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో వివిధ సంఘాల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలియజేశారు. సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వస్కుల శ్రీనివాస్, కొప్పిశెట్టి, సురేశ్, తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోత్, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ బాధ్యులు ఆస్నాల శ్రీనివాస్, కొండయ్య, మహేశ్, సంజీవయ్య, విజయ్‌మోహన్, హరగోపాల్, రాజిరెడ్డి, రవీందర్, సుధాకర్, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి



హుస్సేన్ మృతదేహం

**ఖిలా వరంగల్:** పడమరకోట ఎస్సీ వాడకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్ చెందిన ఎండీ హుస్సేన్(32) ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన మంద సంధ్యారాణిని 12 ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకుని.. భవన నిర్మాణ కార్మికుడిగా సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు సద్దుల బతుకమ్మ ఆడుకునేందుకు వెళ్లగా హుస్సేన్ తన స్నేహితుడైన పడమరకోట పద్మశాలి వీధికి చెందిన గూడూరు శివ వద్దకు వెళ్లాడు. రాత్రి 10గంటల సమయాన హుస్సేన్ సొమ్మసిల్లిపడిపోయి ఉన్నాడని గూడూరు శివ హేస్సేన్ భార్యకు సమాచారం ఇచ్చాడు. సంధ్యారాణి, శివ కలిసి అతడి ఆటోలోనే హుస్సేన్‌ను ఇంటికి తీసుకొస్తారు. కానీ అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్నేహితుడిపై అనుమానం ఉందని మృతుడి భార్య, బంధువులు ఆరోపించారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.













# 16 నుంచి మణుగూరు బెల్గావి రైలు ప్రారంభం



**దోర్నకల్:** బెల్గావి మణుగూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 16 నుంచి పునఃప్రారంభం కానుంది. పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సుమారు నాలుగు నెలల క్రితం రద్దయిన ఈ ఎక్స్‌ప్రెస్‌ను 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నపడనున్నారు. వారానికి నాలుగు రోజులు నడిచే ఈ రైలు బెల్గావి నుంచి మణుగూరుకు(07335) ఆది, సోమ, బుధ, గురువారాల్లో, మణుగూరు నుంచి బెల్గావి(07336) ఆది, బుధ, గురు, శనివారాల్లో నడవనుంది. బెల్గావి రైలు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ తాము ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన జీఎం అరుణ్‌కుమార్‌ను కలిసి రైలును పునరుద్ధరించేందుకు కృషి చేశారని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనుపాషా తెలిపారు.

# క్రీడాకారిణికి ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

**పలిమెల :** అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన మండల కేంద్రానికి కావేరి జ్యోతికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా రూ.1.19 లక్షల చెక్కును కావేరి జ్యోతికి అందజేశారు. ఈ నెల 4వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'కాలు కోల్పోయినా.. కఠోర సాధనతో ముందుకు' అనే శీర్షకన ప్రచురితమైన కథనానికి స్పందనగా రాష్ట్ర ప్రభుత్వం కావేరి జ్యోతికి ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కావేరి జ్యోతి, తల్లిదండ్రులు కావేరి బుచ్చయ్య- లక్ష్మి దంపతులు మంత్రి శ్రీధర్‌బాబు, సాక్షి దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.














# సాక్షి క్లాసిఫైడ్స్

## REAL ESTATE

### TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1237317]

### PLOT FOR SALE

■ యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రీసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్, అన్ని వసతులతో. Ph: 8106340199 [HA-14723]

## SERVICES

### CHANGE OF NAME

■ I, CHARISHMA, D/o. MOHAMMED ANKOOS AHMED (Old Name), R/o. H.No. 2-7-115, Bhavani Nagar, NGO's Colony, Hanumakonda District, Telangana State 506001, India. I have changed my name as MD. CHARISHMA, D/o. Mohammed Ankoos Ahmed (New Name) for all future purposes. [W-1237322]

### గొర్రె / గొర్రె పోతులు అమ్మకం

■ దేశవాలి గొర్రెపోతులు & గొర్రెలు కాపరిచే పెంచబడినవి అమ్మకమునకు కలవు. గొర్రె పోతు లైవ్ 1కెజి. 460/-, గొర్రె (ఆడది) లైవ్ 1కెజి 400/- బ్లాపూర్, దామెర మం॥ సంప్ర. 9030241156, 9121604262 [M-12175]

## WANTED

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663. [H-796283]

■ Wanted Civil Engineer's Male Only + Marketing Executives for Sai Manikanta Reddy Mix Concrete Diploma/B.Tech, Civil with 2 years Experience Drop your Resume on Whatsapp No's 7670956668, 7330871166, 8555890439, 9849277408. [WA-14711]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

| | |
|---|---|
| హన్మకొండ | 9010144453 |
| వరంగల్ | 9705748198 |
| నర్సంపేట | 9553955722 |
| జనగామ | 9951602871 |
| మహబూబాబాద్ | 9010144453 |
| పరకాల | 9010299096 |
| జయశంకర్ భూపాలపల్లి | 9705748198 |

### గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



విజయదశమి శుభాకాంక్షలు

# ఆర్థరైటీస్ (కీళ్ళ వాతం) ను జయించడమెలా?



ఆర్థరైటీస్‌పై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరము అక్టోబర్ 12 వ తేదీన ఆర్థరైటీస్ సదస్సులు నిర్వహించడం జరుగుతుంది.

- **ఆర్థరైటీస్ అంటే ఏమిటి?**
  మనలోని రోగ నిరోదక శక్తి యొక్క లోపాల వలన వచ్చే సమస్యలే "ఆర్థరైటీస్" అంటాము. మనయొక్క సొంత కనాలను గుర్తించకపోగా వాటిపైనే ఈ రోగ నిరోదక శక్తి పనిచేయడం వలన కీళ్ళు, కండరాలు మరియు ఇతర అవయవాలు ఈ ఆర్థరైటీస్‌లో దెబ్బతింటాయి.
- **ఆర్థరైటీస్ గుర్తించడం ఎలా?**
  ఎ) కీళ్ళ నొప్పులు, లేక కీళ్ళ వాపులు నెల రోజుల కంటే ఎక్కువగా ఉన్నట్లయితే అది ఆర్థరైటీస్ కావచ్చు.
  బి) నిద్రలేవడంతోనే కీళ్ళనొప్పులు లేక కీళ్ళు బిగుసుకుపోవడం అవి అరగంట నుండి గంట పాటు ఉండడం వీటి ముఖ్య లక్షణం.
- **వైరల్ జ్వరాలు (డెంగ్యూ, చికెన్ గునియా) ఆర్థరైటీస్‌కు దారి తీస్తాయా?**
  కొన్ని వైరస్‌లు ముఖ్యంగా ఆల్ఫా వైరస్‌లు (డెంగ్యూ, చికెన్ గునియా) కోవకు చెందినవి. జ్వరంతోపాటు తేలికపాటి నొప్పుల నుంచి ఆర్థరైటీస్ వరకు దారితీసే అవకాశం ఉంటుంది. ఈ కీళ్ళ సమస్యలు కొన్ని వారాల నుంచి నెలల వరకు వుండే అవకాశం కలదు.
- **ఆర్థరైటీస్ ఏ వయస్సు వారిలో వస్తుంది?**
  ఆర్థరైటీస్ సమస్యలు వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లలతో మొదలుకొని వృద్ధుల వరకు ఎవరికైనా రావచ్చు.
- **రుమాటిక్ సమస్యలు ఇతరులకు సోకే అవకాశం ఉంటుందా?**
  రోగ నిరోధక సమస్యలు ఆటో ఇమ్యూన్ కనుక ఇతరులకు సోకే అవకాశం ఉండదు.
- **ఆర్థరైటీస్ సమస్యలు వంశపారంపర్యంగా వస్తాయా?**
  కొంతమేరకు భావితరాల వారికి వచ్చే అవకాశం ఉన్నప్పటికి షుగర్ వ్యాధి మరియు ఇతర వ్యాధులతో పోలిస్తే దీని శాతం తక్కువగా భావితరాల వారికి సంక్రమిస్తుంది.
- **రుమటాలజీ సమస్యలు ఉన్నవారు వివాహం చేసుకోవచ్చా? వివాహం తరువాత సంతాన సమస్యలు వస్తాయా ?**
  సరైన మందులు సకాలంలో వాడటం ద్వారా వ్యాధిని నియంత్రించినవారు వివాహం చేసుకోవచ్చు. వివాహం తర్వాత సంతాన సమస్యలు రావు. కానీ కొన్ని రుమాటిక్ సమస్యలు ముఖ్యంగా ఎస్ఎల్ఈ ఉన్నవారికి రోగ తీవ్రత తక్కువగా ఉన్నప్పుడే సంతానానికి ప్లానింగ్ చేసుకోవచ్చు.
- **ఆర్థరైటీస్ వాడే ట్రీట్మెంట్‌లో స్టెరాయిడ్స్ ఉంటాయా?**
  రుమాటాయిడ్ సమస్యలు నియంత్రించే ప్రక్రియలో అవయవాలను (ఊపిరితిత్తులు, గుండె, లివర్, కిడ్నీ, కళ్ళు) కాపాడుకొనుటకు కొంత వరకు ఈ స్టెరాయిడ్స్‌ని వాడుకోవచ్చు. కానీ సంబంధిత రుమటాలజీ డాక్టర్ పర్యవేక్షణలో వారి సలహా మేరకు ఈ మందులు వాడినట్లయితే ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.
- **రుమటాలజీ సమస్యలు ఉన్నవారు ట్రీట్మెంట్ జీవిత కాలం ఉంటుందా? మందులు జీవిత కాలం వాడాలా?**
  రుమటాలజీ సమస్యలు ఎక్కువ వరకు దీర్ఘకాలిక సమస్యలు కావడం వలన దానికి సంబంధిత మందులు కూడా దీర్ఘకాలం వాడాల్సి ఉంటుంది. ఈ వ్యాధులు పూర్తిగా తగ్గకముందే ట్రీట్మెంట్ ఆపివేయడం వంటి నిర్లక్ష్యం వహిస్తే వ్యాధి పునరావృతం అయ్యే అవకాశాలు ఉంటాయి.

- రుమటాయిడ్ ఆర్థరైటీస్
- ఎస్.ఎల్.ఈ
- సోరియాటిక్ ఆర్థరైటీస్
- వాసుక్యులైటీస్
- యాంకిలోసిస్ స్పాండిలైటీస్

- **మోకాళ్ళ సమస్యలకు ఆపరేషన్ తప్పనిసరా?**
  మోకాళ్ళ సమస్యలకు కీళ్ళ మధ్య గుజ్జు తగ్గడం (Synovial Fluid) వలన మోకాళ్ళ అరుగుదల వస్తుంది. వీటి స్టేజిని బట్టి సంబంధిత మందులు మరియు వ్యాయామం (ఫిజియోథెరపి) చేయడం వలన అరుగుదలను నియంత్రించవచ్చు మరియు అరుగుదల కారణాలు శోధించినట్లయితే వీటిని ఆపరేషన్ వరకు వెళ్లకుండా ఆపవచ్చు.



డా॥ రాజేశ్వర్‌రెడ్డి గూడ, యం.డి.
కన్సల్టెంట్ రుమటాలజిస్ట్-మేధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
సెల్: 7799788066
Advertisement


# నేడు గార్లలో జాతీయజెండా ఆవిష్కరణ

● దసరా రోజున జెండా ఆవిష్కరణ ఇక్కడ ప్రత్యేకత
● నైజాం కాలం నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ

**గార్ల:** జాతీయతా భావాన్ని, దేశభక్తిని మననం చేసుకుంటూ అందుకు చిహ్నంగా దసరా పండుగ రోజు మానుకోట జిల్లా గార్ల మండల కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా వస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన అనంతరం గార్ల మున్సిపాలిటీకి చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నేత మాటేడి కిషన్‌రావు దసరా పండుగ రోజు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. దీంతో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి. గార్ల మున్సిపాలిటీ కమ్యూనిస్టు పార్టీ కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు దేశభక్తికి చిహ్నంగా పార్టీలకు అతీతంగా దసరా రోజు జాతీయ జెండాను ఎగురవెయ్యాలని తీర్పు ఇచ్చింది. దీంతో 1958లో నాటి మున్సిపల్ చైర్మన్ మాటేడి కిషన్‌రావు జాతీయజెండాను ఎగురవేశారు. నాటినుంచి దసరా రోజు జాతీయజెండాను గార్ల వీధుల్లో మేళతాళాలతో పంచాయతీ పాలకవర్గం, స్థానిక ప్రముఖులతో కలిసి ఊరేగించి మసీదు సెంటర్లోని గద్దెపై సర్పంచ్ జాతీయజెండాను ఎగురవేస్తారు. ఈ ఏడాది సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గార్ల మేజర్ గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ మంగమ్మ నేడు జాతీయజెండా ఆవిష్కరిస్తారని పంచాయతీ కార్యదర్శి కిషన్ వెల్లడించారు.

